క్లుప్తంగా

కార్మికులకు వైఎస్సార్‌సీపీ మద్దతు



గురునానక్ కర్మాగారం ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

హిందూపురం అర్బన్: తూమకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ కర్మాగారం ఎదుట కార్మికులు చేపట్టిన నిరసన మూడోరోజుకు చేరుకుంది. బకాయి పడ్డ వేతనాలు, పీఎఫ్, ఇతర బెనిఫిట్స్ చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథ్, శ్రీకాంత్, సతీష్, చంద్ర, రమేష్, శివప్ప తదితరులు బుధవారం కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు... హిందూపురానికి చెందిన బ్యాంకు ఉద్యోగి పవన్‌కుమార్, భార్య సునంద, కుమార్తెలు రమ్యవైష్ణవి, పూజితలతో కలసి హిందూపురం నుంచి పెనుకొండకు విహార యాత్రకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై ఆవును తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్‌పెట్టడమే లక్ష్యం



మాట్లాడుతున్న సెబ్ ఈఎస్ రవికుమార్

పెనుకొండ: అసాంఘిక కార్యకలాపాలను అణచివేయడమే సెబ్ లక్ష్యమని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సెబ్ సీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ తరహాలో నేర నియంత్రణకు సెబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, గ్యాంబ్లింగ్, ఇసుక, ఎర్రచందనం వంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే సెబ్ లక్ష్యమన్నారు. గత ఏడాది 607 కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది 8 నెలల కాలంలోనే 778 కేసులు నమోదు చేశామన్నారు. గతంలో 561 మందిని అరెస్ట్ చేయగా ఇప్పుడు 693 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. గతంలో 5,500 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయగా, ఈ ఏడాది 6,300 లీటర్ల సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో వాహనాలు 154 సీజ్ చేయగా ఈ యేడు 189 వాహనాలు సీజ్ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హెడ్ కానిస్టేబుల్ పీరా తెలిపిన వివరాలమేరకు.. హిందూపురంలోని అంధుల పాఠశాలలో చదువుతున్న మధువీర (19) తన తండ్రి వెంకటేష్‌తో పాటు స్వగ్రామమైన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దపాడు గ్రామానికి ఆటోలో వెళ్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి తరువాత కియా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో మధువీర, వెంకటేష్‌తో పాటు డ్రైవర్ నాగేంద్రను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మధువీర అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు బుధవారం కియా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గురువులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

హిందూపురం: గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పాండురంగనగర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగుల్లో విశిష్ట సేవలు అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగాధర్, హరిప్రసాద్, లోక్‌నాథ్, మహేష్‌నాయక్, అశోక్, సువర్ణ భారతి లెక్చరర్ దివ్యచరితలను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లక్ష్మినారాయణ ఉపాధ్యక్షులు గంగాధరయ్య, శ్రీనివాసులు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్



అమరాపురం: ప్రత్యేక అలంకరణలో గోపాల కృష్ణుడు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ కృష్ణాష్టమి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. పలు ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

- అన్ని ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు
- చిన్నికృష్ణులు, గోపిక వేషధారణలో చిన్నారుల సందడి



హిందూపురం: అలంకరణలో వేణుగోపాలస్వామి



నీలకంఠాపురంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



సోమందేపల్లి: వేడుకల్లో పాల్గొన్న యాదవులు



భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని గౌడనహళ్లి, నీలకంఠాపురం గ్రామాల్లో బుధవారం భక్తులు కోలాహలం మధ్య కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గౌడనహళ్లిలో యాదవ కులస్తులు ప్రత్యేకంగా శ్రీకృష్ణున్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. చిన్నారులు ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి, యాదవ కుస్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని కేజీబీవీలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు కులమతాలకు అతీతంగా కృష్ణ, గోపిక వేషధారణలో అందరినీ మురిపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కృష్ణుడి లీలలను వివరించారు.

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమరాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వినియోగం చేశారు. అలాగే అమరాపురం, తమ్మడేపల్లి, వలస గ్రామాల్లో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శనివారం వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు.

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీరామ భక్తి మండలి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుపుకున్నారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో చిన్నారులు అలరించారు. అర్చకులు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ శ్రీకష్ణుడి విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత దేవాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



రొళ్ల: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లి, నల్లగొండ్రాయనపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో కాలమ్మ ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గోపూజా, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పావగడ: స్థానిక తాలూకా కార్యాలయంలో తహసీల్దార్ వరదరాజు నేతృత్వంలో అధికారికంగా కృష్ణాష్టమి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుని చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. స్థానిక తాలూకా యాదవ సంఘం అధ్యక్షుడు ముగదాళబెట్ట నరసింహయ్య, మైలారరెడ్డి, శివకుమార్, ఆర్‌ఐ రాజగోపాల్, హనుమంతరెడ్డి, జిటి గిరీశ్, రాజవంతి నరసింహప్ప, కడమలకుంట రామాంజి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యాధికారి షంషు నేతృత్వంలో కృష్ణాష్టమిని నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సేవాశ్రమంలో స్వామి జపానంద ఆధ్వర్యంలో పూజలు, భజనలు నిర్వహించారు.



వెన్న అలంకరణలో వేణుగోపాలస్వామి

గోరంట్ల: మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని మేరెడ్డిపల్లి, మల్లాపల్లిలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. పట్టణ సమీపాన మారుతీ కాలనీలో గల బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరీ పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా తయారు చేసిన మంటపంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఉంచి విషేష పూజలు చేశారు. తర్వాత వివిధ తరగతుల విద్యార్థులు రాధా, చికృష్ణుడు, రుక్మిణి, గోపికల వేషాధారణలో సందడి చేశారు.



హిందూపురం: ఆర్‌పీజీటీ రోడ్డులోని వేంకటేశ్వరాలయంలో అలంకరణలో స్వామివార్లు

హిందూపురం: శ్రీకృష్ణ జన్మష్టమి పండుగను పురస్కరించుకుని పట్టణంలో వేడుకలు ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలోన్లి త్రైతసిద్ధాంత ప్రబోధ సమితి జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు ఆదినారాయణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. పట్టణంలోని చిన్న మార్కెట్ వద్ద ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీనివాస మందిరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.



అగళి: కృష్ణ, గోపిక వేషధారణలో కేజీబీవీ విద్యార్థినులు



పావగడ: తాలూకా కార్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



రొద్దం: శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఉట్టిని కొడుతున్న చిన్నారి

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని చెన్నంపల్లిక్రాస్‌లో వైఎస్సార్‌సీపీ మండల నూతన కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసంతృప్త నేతలందరినీ కలిశారు. పార్టీలో వర్గ విభేదాలకు తావు లేకుండా అందరూ కలసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురంపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే సమన్వయంతో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్లు రాజారెడ్డి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని హుస్సేన్‌పురం, శెట్టిపల్లిల్లో కూడా వేణురెడ్డి పర్యటించారు.



చిలమత్తూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

యువకుడి మృతిపై కేసు నమోదు

పరిగి: మండలంలోని ధనాపురంలో మంగళవారం రాత్రి గోవిందప్ప (39) అనే యువకుడు మృతి చెందగా.. ఆయన తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఆయన వివరాలమేరకు... హొన్నంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికుడిగా పనులు చేస్తున్న గోవిందప్పకు కల్లుతాగే అలవాటు ఉండేదన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చిన తన కుమారుడు ఛాతిభాగంలో నొప్పి ఉందని చెప్పిన కాసేపటికే కుప్పకూలిపోయాడని తెలిపారు. ఈక్రమంలో బుధవారం పరిగి పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అనంతరం హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రిలో శవపంచనామ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. కాగా పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి కారణాలను తెలుస్తాయన్నారు.



మృతుడు గోవిందప్ప

అమరవీరుల చిహ్నంగా వీరగల్లు

పావగడ: తాలూకాలోని నాగలమడక వద్ద ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న వీరగల్లును ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం సందర్శించారు. భద్రత లేక నిధుల దొంగల చేతుల్లో వీరగల్లును ధ్వంసం చేస్తున్నారని కుందిర్పి మండలం అష్టావధాని గురువేపల్లి నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక ఇతిహాస అకాడమీ సభ్యుడు ప్రముఖ కవి హోమా నాగరాజు, కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, పాఠశాల హెచ్‌ఎం రామచంద్రప్ప, ఉపాధ్యాయులు వెంకటేశ్, కుమార్, శకుంతల, బాలాజి నాయక్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



వీరగల్లును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

'పురం'లో ఆంజనేయుడి భారీ విగ్రహం

- సూగురు ఆలయం వద్ద ఏర్పాటుకు సన్నాహాలు

హిందూపురం: హిందూపురంలోని సూగురు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద 44 అడుగుల అభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహం నిలిపే ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నట్లు విగ్రహదాత వై.చంద్రశేఖర్ తెలిపారు. హిందూధార్మిక సంఘ నాయకులు బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక మధుగిరి సమీపంలోని కొండ ప్రాంతాల నుంచి 500 టన్నుల భారీ కొండ రాతిని హిందూపురానికి 8వ తేదీ తీసుకొస్తున్నామన్నారు. హనుమాన్ విగ్రహం ఎత్తు 33 అడుగులు, బెస్మెంట్ 11 అడుగుల భారీ రాతి విగ్రహాన్ని మధుగిరి నుంచి 120 చక్రాల ప్రత్యేక లారీలో తీసుకొస్తున్నామన్నారు. అనంతరం సూగురు దేవస్థానం వద్ద నిలిపి తుది మెరుగులు దిద్దిన తర్వాత ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహిస్తామన్నారు.



మాట్లాడుతున్న హిందూ ధార్మిక సంఘ నాయకులు

సాధర కులస్తులను ఓబీసీలోకి చేర్చాలి

రొళ్ల: హిందూ సాధర కులస్తులను ఓబీసీ జాబితాలోకి చేర్చాలని మడకశిర నియోజకవర్గం హిందూ సాధర కులస్తుల సంఘం అధ్యక్షుడు గుడ్డగుర్కి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల సాధర కులస్తుల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, డైరెక్టర్లు తదితరులతో ఓబీసీ జాబితాలోకి చేర్చే విషయం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం హిందూ సాధర కులస్తుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ సాధర కులస్తులు విద్య, వ్యాపార రంగాలతో పాటు రాజకీయ పరంగా వెనుకబడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఓబీసీ బాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు.

ఏపీ సెంట్రల్ కమిటీ ఎన్నిక

మండల కేంద్రంలో హిందూ సాధర కులస్తుల ఆధ్వర్యంలో మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల నుంచి హిందూ సాధర కులస్తుల తరఫున ఏపీ సెంట్రల్ (కేంద్ర) కమిటీని బుధవారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాధర కులస్తుల సెంట్రల్ కమిటీ అధ్యక్షుడిగా రంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.రవికుమార్, ట్రెజరర్‌గా ఎస్.లక్ష్మీనారాయణరెడ్డితో పాటు 13 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు.



రొళ్లలో సమావేశమైన సాధర కులస్తులు

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నారాయణ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ సెలవు రోజుల్లో నారాయణ కళాశాల తరగతులను నిర్వహిస్తోందన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నిహాల్, హర్షకుమార్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



నారాయణ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

పెనుకొండ: ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్నుకున్నారు. రుద్రేష్ అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా జి. మధుసూధనరెడ్డి, అధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణనాయక్ ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా రఘునాథరావు, మల్లిక, రామాంజినేయులు, రుద్రేష్, రఘునాథ, వెంకటేసులు, ఉపాధ్యక్షులుగా రవీంద్ర, నారపరెడ్డి, శైలజ, చంద్రమోహన్, కార్యదర్శులుగా గిరిప్రసాద్, యశోదమ్మ, క్రిష్టప్ప, ప్రభాకర్, జీసి. వెంకటేసులు, గంగప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా చంద్రశేఖర్, సభ్యులుగా సంజీవమ్మ, చంద్రశేఖర్ తో పాటు సభ్యలను ఎంపిక చేశారు.

కష్టంలో అండగా నిలిచిన వలంటీర్



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చామంతి

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేట తండాకు చెందిన నటరాజునాయక్ అనే వృద్ధుడు 15 రోజులుగా అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ ఇచ్చేందుకు వెళ్లిన వలంటీర్ చామంతి విషయం తెలుసుకున్నారు. నటరాజునాయక్ ఆర్థిక పరిస్థితి సరిగా లేదని స్థానికులు తెలియజేయడంతో వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పింఛన్ డబ్బును అందజేశారు.

నూతన కమిటీ ఎంపిక

పెనుకొండ: కోన కణ్వాశ్రమ కమిటీని ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మల్లికార్జునస్వామి కణ్వాశ్రమము ఆలయ కమిటీ కోన పేరుతో కమిటీ ఏర్పడింది. అధ్యక్షుడిగా చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోతన్న, కార్యదర్శిగా ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శిగా ముకుంద, ట్రెజరర్‌గా లక్ష్మినారాయణ ఎన్నికయ్యారు.

రెడ్ల ఐక్యత చాటాలి



నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు

హిందూపురం: రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ల ఐక్యతతో పాటు జేఏసీని బలపేతం చేయడంతో పాటు సామాజిక, ప్రజాసేవా కార్యక్రమాల్లో తమవంతు సహకారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు విప్పల శివకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రెడ్డి జేఏసి కార్యాలయంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు వెంకటేష్‌రెడ్డి అధ్యక్షతన రెడ్డి జేఏసీ క్రియాశీలక సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విప్పల శివకుమార్‌రెడ్డి, రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలలో బలమైన రెడ్డి జేఏసీ కమిటీలను ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రెడ్ల ఐక్యతను చాటిచెప్పాలన్నారు. ప్రతి పేదవాడ్ని ఆదుకునే దిశగా రెడ్డి సామాజిక జేఏసీ ముందుకు పోవాలని కోరుకుంటున్నామని చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరిగి: మండలంలోని ఊటుకూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ తండ్రి మల్లప్ప అనారోగ్యంతో బుధవారం చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఊటుకూరుకు వచ్చి మల్లప్ప భౌతికకాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.